# ఫిక్ ట్రూత్

# మిత్రవాక్యం

ఆంధ్రదేశంలో ఇప్పుడు చెలామణీలో వున ఓ మందపాటి సత్యం గురించి చెప్ప మంటారా? అమెరికాను తిట్టడం, అదే నోటితో అమెరికాకు ఆహ్వానానికి ప్రాధేయపడటం. ఎన్.ఆర్.ఐ.లంటే తమ అమెరికా యాత్రకు ప్రాయోజకులు. తమ గ్రంధాలను సాంస్కృతిక కళను డాలర్లలో ప్రోత్సాహించేవారు. గొప్ప పెళ్ళి సంబంధాలవారు. పైకి సామ్రాజ్య వాద సంస్కృతీ నిరసన. లోన అమెరికా పట్ల ఆరాధన. ఇది హిపోక్రసీయే! కానీ ఇండియాలో, అందునా ఆంధ్రదేశంలో చెలామణీలో వున్న వాస్తవం.

ఎన్.ఆర్.ఐ.లంటే ఇప్పుడు ఇండియాలోనే వున్నారు. ఎవరంటారా? 'నాన్ రెస్పెక్టెడ్ ఇండియన్స్'. 'మనవాళ్ళు వట్టి వెధవాయిలోయ్' అని గిరీశం అన్నాడు. తెలుగు భాష పట్ల, సంస్కృతి పట్ల, కళారూపాల పట్ల గొప్ప అభిమానంతో అమెరికాలోని తెలుగు వారు ఆంధ్రదేశంనించి సాహితీవేత్తలను, కవులను, కళాకారులను, సాంస్కృతిక బృందాలను ఆహ్వానిస్తుంటే అక్కడికి వెళ్ళి డబ్బు కాపీనంతో, అక్కడి సంస్కృతి పేరిటి వికార చేష్టలతో గౌరవాన్ని కోల్పోతున్న వారున్నారు. అదే సమయంలో చదువుల కోసం, ఉద్యోగాల కోసం అనివార్యంగా అమెరికాకు తరలివెడుతున్న భారతీయులలో తెలుగువారూ ఎందరో వున్నారు. 'మనిషి మనిషికీ ఒక ఆశ. ఆశ జీవితానికి శ్వాస మరి'. ఈ వ్యవహారమంతా సత్యంకు తెలుసు. అమెరికాలో వున్న ఆ 'మెరిక'లాంటి సృజనశీలత అతని సొంతం. 'తెలుగువాడు పైకి వస్తున్నాడు తొక్కేయండి' అనే బాపతుగాళ్ళు తనకు బాగా తెలుసు.

మందపాటి సత్యం రచయిత. కథకుడు. అమెరికాలో ఎన్.ఆర్.ఐ.గా, ఉద్యోగం చేసుకుంటూ తెలుగు బడి, తెలుగు నుడి, ఒడి చేర్చుకున్నవాడు. అమెరికా గురించీ, ఇండియా గురించీ ఇరుపార్శ్వాలనూ ఇంగితజ్ఞానంతో ఎరిగినవాడు. ఇండియానించి నెల నెలా కొన్ని వేలలో దిగుమతి అవుతున్న మన భారతీయులకీ, ముఖ్యంగా తెలుగువాళ్ళకి అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి కావలసిన రకరకాల విషయాల పై సమాచారం ఇవ్వాలన్న సంకల్పమే బహుదొడ్డది. 'ఎన్నారై కబుర్లు' అలా రూపుదాల్చినవే. ఆంధ్రభూమి వారపత్రిక ఎడిటర్ ఎ.ఎస్.లక్ష్మిగారు దీనినొక శీర్షికగా మలచి వారం వారం రాయించి, ఈ కబుర్లకు కాలక్షేపాన్ని కాక, గొప్ప ప్రయోజనాన్ని సంతరించి పెట్టారు.

'ఏదో చుట్టం చూపుగా వచ్చే వాళ్లకి ఫరవాలేదు. ఎవరో ఇక్కడ సహాయం చేస్తారు. ఇక్కడ చదువుకోటానికి వచ్చేవాళ్లూ, ఉద్యోగాలకి వచ్చేవాళ్లూ ఎలాంటి బాధలూ పడకూడదనే' తన పాతికేళ్ళ అమెరికా అనుభవంతో చూసినవీ, నేర్చుకున్నవీ, మిత్రుల అనుభవాలూ చక్కని విశ్లేషణలతో, పరిశోధనతో, హాస్య చమత్కారాలతో, మాననీయ విలువలనే మూలకందంగా చేసుకుని మందపాటి సత్యం ఈ కబుర్లు వెలువరించారు. అమెరికాలో భారతీయుల జీవితాన్నీ, ఇండియాలో మనవాళ్ల అమెరికా మోజునీ నిశితంగా

పరిశీలించిన పాటవం ఈ రెండో సంపుటిలోని డెభై నాలుగు వ్యాసాలలో స్ఫుటంగా, ఇంత విస్తారమైన ఇతివృత్తాలను ఎన్నుకుని నిర్వహించడంలో గొప్పగా ద్యోతకమౌతోంది!

ముళ్ళపూడి ఊరికే అన్లేదు, నిజంగా మందపాటి సత్యానిది 'ఇన్ఫోటైన్ మెంటాలిటీ'. సమాచారాన్నీ, సరదానీ మేళవించి; అదే సమయంలో బాధ్యతలనూ కర్తవ్యాలనూ గుర్తు చేస్తూ, సలహాలనూ సంప్రదింపులనూ అందిస్తూ, ఈ ఎన్నారై కబుర్లను కేవలం 'డయాస్ఫొరా' సాహిత్యంగానే కాక, అమెరికా రాగోరేవారికీ, వచ్చి వుండగోరేవారికీ ఒక కరదీపికగా, హితవరిగా సంతరించారు.

'తెలుగుబడి' తెలుగేతర ప్రాంతాల్లో ఇంగ్లీషులో తెలుగు చెప్పే విధానాన్ని తేటతెల్లం చేస్తూ తెలుగుపై ఇష్టాన్ని, తెలుగుతనం నిలుపుకునే సిస్టాన్ని చెబుతుంది. 'సునామీ' మానవీయ విలువలను ప్రోది చేసిన ఘటనల సమాహారం. ఔట్‌సోర్సింగ్– ఒకటి, మరోటి, ఇంకోటి, సర్జనులు, దుర్జనులు ఎంతో వైవిధ్యంతో విస్తరించిన సీక్వెల్ కబుర్లు. ఈ కబుర్లలో ముళ్ళపూడి జోక్‌లు చాలా చోట్ల ప్రస్తావించారు అవన్నీ సందర్భశుద్ధితో విషయానికి బంగారానికి తావిలా అమిరాయి. 'ఎవరది' అంటే 'నేనే' అని సమాధానం. 'నేనే అంటే' అని రెట్టించి అడిగితే 'అది తెలుసుకుందా మనే కదా నా ప్రయత్నం' అనే తాత్వికత.

అమెరికాలో 'రూరల్‌సోర్సింగ్' మనకి కనువిప్పు కావాలి! పత్రికలు నిజాలని నిజాయితీతో చిత్రించటమే కాదు, అన్యాయాన్నీ రాజకీయ దుర్గంధాన్నీ చిత్రిక పట్టాలి కూడా. అదే 'పత్రికల చిత్రిక'. ఎనిమిది కోట్ల తెలుగువాళ్ళు, కనీసం వెయ్యి కాపీలు మాత్రమే ప్రచురిస్తున్న ప్రముఖుల పుస్తకాలను ఆదరించలేకపోతున్నారనే బాధ 'పుస్తకం హస్తభూషణం'. అడగందే అమ్మయినా పెట్టదు. ఈ అడగటమే 'లాబీ.. లాబీ...' అమెరికానుండి 'వెళ్ళొస్తామండీ' అంటున్నవారెందరు? అప్పు చేసే శక్తి, ఎస్టాబ్లిష్డ్ క్రెడిట్ వుండాలి. తలకు మించినవీ, తనకు మించినవీ అప్పులొద్దు. (ఓ ఫైవుందా సార్) 'చచ్చినా చావకు', 'విడియో పెళ్ళి', 'చీకటిలో చందమామ', 'నాతి చరామి' యుద్ధకాండ', 'మనసా కవ్వించకే', 'వ్యాపారాయణం'... ఇలా ఎన్నో... ఎన్నెన్నో... ఇన్ని విస్తారమైన విషయాలను క్రోడీకరించి, ఇంత కమనీయంగా వివరించి చెప్పడం నిజంగా గొప్ప సృజనాత్మక ప్రతిభ. వారం వారం కైవారం!

అమెరికా వెళ్లినా వెళ్లక పోయినా ఇండియాలోని ప్రతివారూ ఓసారి ఈ ఎనారై కబుర్లు చదివి తీరాలి. అమెరికా తెలుగువారూ విధిగా ఈ కబుర్లు తమ అనుభవాలతో కలిపి కలబోసుకోవచ్చు. వెరసి ఇది ఉపయుక్తమైన మాటామంతీ. ఒక మంచి పరామర్శ గ్రంథం. కథకుడిగా ప్రసిద్ధుడైన మందపాటి సత్యం ఈ కబుర్ల ద్వారా ఒక ఇష్టుడైన కాలమిస్టుగా, హ్యూమనిస్టుగా, తనదైన హ్యూమరిస్టు పంథాలో పాఠక జన హృదయాలను నిస్సందేహంగా అలరించగలడు. అందుకు దాఖలాయే ఈ 'ఎన్నారై కబుర్లు'. మార్గదర్శక రచయితగా అమెరికాకు, ఆంధ్రదేశంలోనూ ఇక ఈ మందపాటి సత్యం గొప్ప చెలామణీలో వుండటం ఖాయం. ఇది మిత్ర వాక్యం.

సదా మీ

సుధామ

# సత్యం! శివం! సుందరం!

సత్యం అంటే నిజం. శివం అంటే మంచి విషయం, ఆనందం, సంతృప్తి అని చాల అర్థాలున్నాయి. సుందరం అంటే అందమైనది. కలిసి వుండటం అని కూడా అర్థం వుంది. సత్యం కాళ్ళుగానూ, శివం శరీరంగానూ, సుందరం ముఖం లేదా తలగానూ వర్ణిస్తారు. కాళ్ళ మీద నిలబడి, శరీరంతో కదలికలు తెచ్చి, తలతో ఆలోచిస్తారని భాష్యం. వేదాంతపరంగా ఇంకా చాల వివరణ వుంది.

నేను నా చుట్టూ చూస్తున్న మంచి విషయాలు, తెలుసుకోదగిన కబుర్లు, అందంగా మిమ్మల్ని ఆనందపరుస్తూ వ్రాద్దామని చేసిన ప్రయత్నమే ఈ ఎన్నారై కబుర్లు. ఇవి మీకు ఉపయోగపడితే, సర్వేజనా సుఖినోభవంతు!

ఇండియానించీ నెలనెలా కొన్నివేలల్లో దిగుమతి అవుతున్న మన భారతీయులకి, ముఖ్యంగా తెలుగు వాళ్ళకి, అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి కావలసిన రకరకాల విషయాలపై సమాచారం ఇచ్చేవారు నాకంతగా కనపడలేదు.

ఇండియాలో స్నేహితుల ద్వారా చూసేవి పరిమితమైన అనుభవాలు మాత్రమే. అందుకని నా పాతికేళ్ళ అమెరికా అనుభవంలో, నేను చూసినవీ నేర్చుకున్నవీ, మిత్రుల అనుభవాలూ, నాకు చేతనైన పద్ధతిలో వ్రాసి, పాఠకులకి అందివ్వటం నా బాధ్యత అనిపించింది.

అలాటివి నాలుగైదు వ్యాసాల్లో వ్రాసి ఆంధ్రభూమి వారపత్రికకి పంపించాను. ఎయస్ లక్ష్మిగారవి ప్రచురిస్తాను కానీ, నాలుగైదులా కాదు ఒక శీర్షికలా వారపత్రికలో నడుపుదాం అని ఉత్తరం వ్రాశారు. ఇక్కడ ఆఫీసు పనితోనూ, తత్సంబంధమైన ప్రయాణాలతోనూ, నేను నడుపుతున్న తెలుగు స్కూలు పనితోనూ, కథా వ్యాసాంగంతోనూ అప్పటికే ఎన్నో గంటలు పని చేస్తున్న నాకు, అది జరిగే పనిలా కనిపించలేదు. అదే వ్రాశాను ఆవిడకి. కానీ పట్టు విడవని లక్ష్మిగారు, మీరు కనీసం ఒక పది వ్యాసాలు వ్రాసేదాకా ఆగి, అప్పుడు ప్రచురణ

మొదలుపెడతాను, దానితో మీకు సమయమూ సరిపోతుంది, వెసులుబాటూ అవుతుంది అని మొహమాటపెట్టారు. అలా మొదలయినాయి ఈ ఎన్నారై కబుర్లు.

ఒక సంవత్సరం పైన వ్రాశాక, అంటే 66 వ్యాసాలు వ్రాశాక, ఆపేద్దా మనుకుని ఆగనా సాగనా అని ఒక వ్యాసం వ్రాశాను. ఇటు సంపాదకులూ అటు పాఠకులూ సాగమనే ఆశీర్వదించారు. అలా ఈ వ్యాసాలు ఇప్పటికి నాలుగు సంవత్సరాల పైగా, 200 వ్రాశాను. అనుకున్న దానికన్నా ఇన్నాళ్ళు దీన్నిలా నడిపించింది లక్ష్మిగారి ప్రోత్సాహం పట్టుదలా. తర్వాత పాఠకుల స్పందనా వారి ఈమైల్సూ. మూడవది నాకు తెలిసిన విషయాలు నలుగురితో పంచుకోవాలనే తపనా.

నేను వ్రాసిన వాటిలో, నాకు వచ్చిన పాఠకుల స్పందన ప్రకారం, కొన్ని ఎంతో ఉపయోగకరంగానూ, కొన్ని హాస్యపూరితంగానూ, కొన్ని వ్యంగ్యంగానూ వున్నాయని. కొన్ని బాగాలేవనీ, వాటిల్లో పైన చెప్పినవి ఏమీలేవనీ, చెప్పిన వాళ్ళందరికీ కృతజ్ఞతలు. అవే నన్ను విషయపరంగా ముందుకు నడిపించిన మణిదీపాలు.

ఆంధ్రభూమి వారపత్రిక సంపాదకవర్గంవారికీ, ముఖ్యంగా లక్ష్మిగారికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన మిత్రులూ, శ్రేయోభిలాషులూ రచన శాయిగారికి ధన్యవాదాలు. చక్కటి ముఖచిత్రం వేసిన బాలిగారికీ, మిత్ర వాక్యం వ్రాసిన మిత్రులూ, శ్రేయోభిలాషులూ సుధామగారికీ కృతజ్ఞతలు. నేనూ రోజూ క్రమం తప్పకుండా, రెండు మూడు గంటలు వ్రాసుకోవటానికి, ఈ నాలుగేళ్ళూ, ఓపికతో సహకరించిన నా సహధర్మచారిణి విమల నిజంగా సహన ధర్మచారిణే!

నేను వ్రాసిన 200 వ్యాసాలూ ఒక పుస్తకంలో పట్టటంలేదు కనుక, ఎన్నారై కబుర్లు - ఒకటి, ఎన్నారై కబుర్లు - మరోటి అని రెండు పుస్తకాలుగా ప్రచురిస్తున్నాం. ముందు చాల వ్యాసాలు తీసేసి, కొన్నే ఒకే పుస్తకంగా వేద్దామనుకున్నాంకానీ ప్రజాభిప్రాయం వేరుగా వుంది. అన్నీ మాకు గైడుల్లా ఉపయోగపడేవే, ఆనందింపచేసేవే, కనుక అన్నీ కావాలన్నారు. ఆ విషయమే దృష్టిలో పెట్టుకుని, ఇంకో వడపోత పోసి కొద్ది వ్యాసాల్ని తీసేసి, రెండు పుస్తకాలుగా మీకు అందిస్తున్నాం. మీ అభిప్రాయాలు ఈమైల్ ద్వారా తెలియచేస్తే సంతోషిస్తాను.

భవదీయుడు
సత్యం మందపాటి